# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఐదు రకాల భూములను 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.
- విదేశీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు.
- ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ.. పారదర్శక పాలన చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.
- ఉగాది నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 క్రింద ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని శతశాతం పూర్తి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.

======================

ఐదు రకాల భూములను 22ఏ జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. అమరావతిలో మంత్రి పాత్రికేయులతో ఈ రోజు మాట్లాడుతూ... మిగిలిన నాలుగు రకాల భూములపై త్వరలో మంత్రుల బృందం చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రైవేట్ భూములను 22ఏ జాబితా నుంచి పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. ప్రైవేట్ పట్టా భూములకు ఎవరు దరఖాస్తు చేసుకున్నా అధికారులు దానిని సుమోటోగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత, మాజీ సైనిక ఉద్యోగుల భూములకు సంబంధించిన పత్రాలు ఉంటే నిషిద్ధ జాబితా నుంచి తొలగించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల భూములను కూడా ఈ జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. రైతులు, భూ యాజమానుల హక్కులను రక్షించడమే తమ ప్రభుత్వ ప్రధమ కర్తవ్యమని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

పార్వతీపురం మన్యం జిల్లాలో నాల్గవ విడత భూ రీసర్వే కార్యక్రమం 6 నెలల్లో పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులతో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... నాల్గవ విడత రీసర్వే 121 గ్రామాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం, భూములపై స్పష్టమైన హక్కులు, ఆధునిక మ్యాప్‌ల రూపకల్పన ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందని అన్నారు. రైతులు, భూస్వాములు తమ భూములకు సంబంధించిన పత్రాలు, పట్టాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రీ సర్వేతో భవిష్యత్‌లో భూ సంబంధిత వివాదాలు గణనీయంగా తగ్గుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

======================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ.. పారదర్శక పాలన చేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్ మండలం కసాపురంలో మంత్రి ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సంవత్సరం ప్రజలకు మరింత అద్భుతమైన ప్రజా పరిపాలన అందిస్తామని తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

======================

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ రోజు నుంచి రేషన్ కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ ఎండీ ఢిల్లీరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నగర ప్రాంతాల్లోని కార్డుదారులకు కిలో 20 రూపాయలకు గోధుమ పిండిని ఇస్తున్నామని తెలిపారు. మిల్లుల ద్వారా కాకుండా పాత పద్ధతిలో తిరగలితో పిండి పట్టించి కార్డుదారులకు ఇస్తున్నామని తెలిపారు. దీని వల్ల గోధుమ పిండిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో గోధుమ పిండి పంపిణీ విజయవంతమైతే తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని ఆయన చెప్పారు.

======================

రైతుల భూములకు శాశ్వత హక్కులు కల్పించే ఉద్దేశంతో రేపటి నుంచి గ్రామసభలు ఏర్పాటు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తామని శ్రీకాకుళం జిల్లా సంయుక్త కలెక్టర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... జిల్లాలో మొదట విడత భూ సర్వే పూర్తి చేసుకున్న 652 గ్రామాల్లో 2 లక్షల 54 వేల 218 పాసు పుస్తకాలు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. రైతులు గ్రామ సభలకు హాజరై పాసు పుస్తకాలు పొందాలని కోరారు.

విరామం

======================

`సంస్కరణల సంవత్సరం`గా నిలిచిన 2025లో భారత్ క్రీడలలో రికార్డు స్థాయిలో విజయాలు సాధించింది. క్రీడలకు ఎలా కీలక సంవత్సరంగా మారిందో తెలియజేస్తూ.... ఆకాశవాణి అందిస్తున్న ఒక ప్రత్యేక వార్తా కథనం.

భారతదేశం దేశం తొలిసారిగా స్క్వాష్ ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. క్రికెట్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు ICC మహిళల ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. భారత పురుషుల క్రికెట్ జట్టు ICC ఛాంపియన్స్ ట్రోఫీ 2025ను గెలుచుకుంది. భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు తమ తొలి T-20 ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. నవంబర్ నెలలో భారతదేశం ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ 2025లో తొమ్మిది బంగారు పతకాలను గెలుచుకుంది. భారత మహిళల ఖో ఖో జట్టు మొట్టమొదటి ఖో ఖో ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు రికార్డు స్థాయిలో 3 వేల 700 కోట్ల రూపాయలకు పైగా కేటాయింపులు చేసింది. భారతదేశాన్ని ప్రపంచ క్రీడా శక్తి కేంద్రంగా మార్చడానికి కేంద్రమంత్రివర్గం జాతీయ క్రీడా విధానం (NSP) 2025ను ఆమోదించింది. జాతీయ క్రీడా పాలన చట్టం-2025 అమలుతో ఈ సంస్కరణల ఊపు మరింత

బలపడింది. అహ్మదాబాద్ ఆతిథ్య నగరంగా 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్య హక్కులను పొందడం.. దేశంలో అభివృద్ధి చెందుతున్న క్రీడల సంస్థాగత, మౌలిక సదుపాయాల సామర్థ్యాలకు గీటురాయిగా నిలిచింది.

======================

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విదేశీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నెల్లూరులో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... పారిశ్రామిక రంగంలో 23 కొత్త పాలసీలని తెచ్చామని.. ఒక్కో జిల్లాకి ఒక్కో పోర్టు వచ్చేలా ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో 13 లక్షల 21 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఆలయాలను ఎకో టెంపుల్ టూరిజం కేంద్రాలుగా మార్చుతామని, 492 పురాతన ఆలయాల్లో 590 కోట్ల రుపాయాలతో పునఃనిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో 6 వేల 310 కోట్ల రూపాయలను జమ చేసిందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఉగాది నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 క్రింద జిల్లాలో 11 వేల 846 ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని శత శాతం పూర్తి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరంలో ఆప్షన్-3 ఇళ్ళ నిర్మాణాలపై సంబంధిత గుత్తేదారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ ఈ రోజు సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత లక్ష్యంలో పూర్తి చేయకుండా అలసత్వం వహించిన గుత్తేదారునిపై కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పేద వారి సొంత ఇంటి కలను నెరవేరచాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు, గుత్తేదారులు పని చేయాలని కలెక్టర్ సూచించారు.

======================

తూర్పు గోదావరి జిల్లాలోని అనపర్తి, రాజమహేంద్రవరం, రాజానగరం, కడియం, కొవ్వూరు మండలాల్లో “స్వచ్ఛ రథం” నిర్వహణకు అర్హులైన వ్యక్తులు, సంస్థలు, స్క్రాప్ డీలర్లు, వాహన ఆపరేటర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి వి. శాంత మణి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు.

======================
======================